
సాక్షి
నంద్యాల
శుక్రవారం । 8 । మార్చి । 2024



20 వరకు ఎల్లెల్సీకి నీరు

హొళగుంద: తాగునీటి అవసరాల నిమిత్తం టీబీ డ్యాం నుంచి ఎల్లెల్సీకి ఈ నెల 20వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగించాలని టీబీ బోర్డు అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



స్పందించిన అటవీ శాఖ సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: నల్లమల నడకమార్గంలో ఎమ్మిగనూరుకు చెందిన వృద్ధురాలు అస్వస్థతకు గురికావడంతో అటవీశాఖ సిబ్బంది స్పందించారు. డోలి సహాయంతో ఆమెను కైలాస ద్వారానికి చేర్చారు.

ఉష్ణోగ్రత

కనిష్టం	25.4
గరిష్టం	40.0

న్యూస్‌రీల్

10న అంబేడ్కర్ గురుకులాల ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5వ తరగతిలో 1,040 సీట్లకు 11 వేలు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 1,400 సీట్లకు 7,551 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను http://apbragcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

975 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం అన్ని పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 52 కేంద్రాల్లో 12,225 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 11,250 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సర పరీక్షలకు హాజరయ్యారు. 975 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవీఈఓ సునీత తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలను విద్యార్థులకు కల్పించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పరీక్ష రాసే విద్యార్థులకు తాగునీరు, ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

రేపు ఎస్‌జీటీలకు పదోన్నతులు

కర్నూలు సిటీ: జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ)లకు ఈ నెల 9వ తేదీన పదోన్నతులు కల్పించనున్నట్లు డీఈఓ కె.శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు తమ వెంట సర్వీసు రిజిష్టర్ తెచ్చుకుని డీఈఓ కార్యాలయంలో వెరిఫికేషన్ చేయించుకోవాలని, ఆ తరువాత సీనియారిటీ జాబితాల్లోని వారికి పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీనియారిటీ జాబితా డీఈఓ బ్లాగ్‌స్పాట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్)రెండు బ్యాక్‌లాగ్ పోస్టులు, ఒక జనరల్ రోస్టర్ పాయింట్ ఉందని ఆయన పేర్కొన్నారు.

కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా నాసిర్

కర్నూలు (సెంట్రల్): కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.నాసిర్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా పులివెందులలో పని చేస్తున్నారు. ఐజీ ఆదేశాల మేరకు కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న హాజీ మియ్యా తన సొంత స్థానమైన నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో రిపోర్టు చేసుకోనున్నారు.



శ్రీశైల పుర వీధిలో కిక్కిరిసిన భక్తజనం



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా, చైర్మన్, ఈఓ



పాతాళగంగకు పోటెత్తిన భక్తులు

నేడు మహాశివరాత్రి పర్వదినం

- పరమశివునికి పాగాలంకరణ ప్రత్యేకం
- అర్ధరాత్రి మహారుద్రాభిషేకం, స్వామిఅమ్మవార్లకు కల్యాణం
- జాగరణకు తరలివస్తున్న భక్తజనం





అదిగదిగో శ్రీశైలం.. భూలోకాన కైలాసం

శ్రీశైలంటెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగాల్లో శ్రీగిరికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ మల్లన్నకు జరిగే విశిష్ట సేవలు దేశంలోనే ఏ క్షేత్రంలో జరగవు. శ్రీశైలంలో మల్లన్నకు పాగాలంకరణ ఒక విశిష్ట సేవ. మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భావ కాలంలో జరిగే ఈ సేవ వెనుక ఎన్నో ఆధ్యాత్మిక అంశాలు నిక్షిప్తమై ఉన్నాయి. పాగాలంకరుడైన మల్లన్నను చూసేందుకు భక్తుల రెండు కళ్లు చాలవు. భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశాన్ని పంచభూతాలుగా పరిగణిస్తారు. వీటి సమ్మేళనమే ఈ భౌతిక ప్రపంచం. ఈ పంచభూతాలకు ప్రతీకలుగా మల్లన్న ఆలయంలోని ఐదు కలశాలు. స్వామివారి గర్భాలయ విమాన గోపురానికి మధ్యలో ఒకటి, నాలుగు మూలలో నాలుగు కలశాలు ఉన్నాయి. గర్భాలయ ముఖమండపంపై తొమ్మిది నందులు ఉన్నాయి. ఈ నవ నందులను, ఐదు కలశాలను కలిపి పాగా చుడతారు. 4కలశాలు, 9 నందులు మొత్తం 14. అంటే 14 లోకాలను ఏలే శ్రీలింగ చక్రవర్తికి ఈ సంఖ్యతో కూడిన పాగాలంకరణ జరగడం విశేషం. తద్వారా 14 లోకాలకు మల్లన్న అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని, లోక కల్యాణం జరగాలన్న ఆకాంక్షలను స్వామి వారికి భక్తులు తెలియజేయడమే ఈ పాగాలంకరణ వెనుక ఉన్న మరో విశేషం. సాలే గూడు శ్రీకాళహస్తీశ్వర మహాత్యం గురించి తెలియని శివ భక్తులు ఉండరు. అందులో శ్రీ అంటే సాలె పురుగు. శివలింగంపై ఎండపడకుండా భక్తితో అది గూడు అల్లుతుంది. తద్వారా పరమశివుడి అనుగ్రహం పొందుతుంది. శ్రీశైలం మల్లన్నకు జరిగే పాగాలంకరణ సాలె గూడును పోలి ఉంటుంది. 14 చుట్లు చుట్టిన పాగాలంకరణ దర్శనం వలన 14 ఇంద్రియాలు నిర్మలమైన బాధల నుంచి విముక్తి పొందుతాయన్న ఆధ్యాత్మిక సందేశం ఇందులో ఇమిడి ఉంది.

గజ వాహనంపై మల్లన్న విహారం

శ్రీశైలం శివనామస్మరణతో మారుమోగుతుంది. ఎటు చూసిన ఓంకార ధ్వనులే వినిపిస్తున్నాయి. మల్లన్న సన్నిధిలో జాగరణ చేసేందుకు లక్షలాది మంది భక్తులు కొండపైకి చేరుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడవ రోజు గురువారం రాత్రి గజరాజుపై మల్లికార్జునుడి వైభవాన్ని భక్తులు కనులారా వీక్షించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులను గజ వాహనంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి , ఈవో డి.పెద్దిరాజు దంపతులు గంగాధర మండపం వద్ద గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు, డ్రమ్స్, డప్పులు,తప్పెట్లు, మేళతాళాలు, భజంత్రీలు, శంఖానాదాల కోలాహలం నడుమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. గజవాహనంపై దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



గజవాహనంపై కొలువైన భ్రామరీ సమేత మల్లికార్జునుడికి ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం



ఉత్సవంలో మహిళల కోలాటం



ఆకట్టుకున్న ప్రదర్శన

రాష్ట్ర ప్రభుత్వం తరఫున మల్లన్నకు పట్టువస్త్రాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆనవాయితీగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు తీసుకురాగా ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే, దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్, ఈఓ పట్టువస్త్రాలు, ఫలపుష్పాలు, పసుపు కుంకుమ, గాజులు తలపై పెట్టుకుని స్వామిఅమ్మవార్లకు సమర్పించారు.

పాగాలంకరణకు సర్వం సిద్ధం

మహాశివరాత్రి పర్వదినాన శుక్రవారం రాత్రి 10గంటల నుంచి 12గంటల లోపు లింగోద్భవ సమయంలో పాగాలంకరణ జరుగుతుంది. ప్రకాశం జిల్లా చీరాల మండలం జాండ్రపేట హస్తినాపురం గ్రామానికి చెందిన చేనేత పృధ్వీ వెంకటేశ్వర్లు పాగా వస్త్రంతో శ్రీగిరికి చేరుకున్నారు. అలాగే గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తీసుకువచ్చిన పాగాను దేవస్థాన పరిపాలన భవనంలో అధికారులకు అప్పగించారు. స్వామివారికి దిక్కులే వస్త్రాలు. అందుకే పాగాలంకరణ సేవ చేసేవారు దిగంబరంగానే ఉండి కార్యాన్ని పూర్తి చేస్తారు. ఆ సమయంలో ఆలయం, పరిసరాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. పాగాలంకరణ పూర్తయ్యాక విద్యుత్ వెలుగులు నింపుతారు. పాగాలంకరణ సమయంలో మల్లన్నకు లింగోద్భావకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.



పాగాలంకరణకు సిద్ధంగా ఉంచిన పాగా



పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటున్న భక్తులు

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు..

మహాశివరాత్రి అత్యంత పవిత్రమైన రోజు. మహా శివరాత్రి నాడు ఉపవాసం ఉండి జాగరణ చేస్తే సకల శుభాలు కలుగుతాయని విశ్వసించిన లక్షలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో శ్రీగిరి పోటెత్తింది. భక్తుల శివనామస్మరణతో మారుమోగుతుంది. క్షేత్రంలో శివస్వాములు, భక్తుల శివభజనలు, శివనామస్మరణ, ఓంకార ధ్వనులతో శ్రీశైలం మరింత అధ్యాత్మికతను సంతరించుకుని ఇలకైలాసాన్ని తలపిస్తుంది.

అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

- వైఎస్సార్ నాలుగో విడత చేయూత నిధులు విడుదల
- అనకాపల్లి జిల్లా బహిరంగ సభలో బటన్ నొక్కిన సీఎం వైఎస్ జగన్
- జిల్లాలో 92,254 మంది లబ్ధిదారులకు రూ.182.35 కోట్లు జమ
- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా తదితరులు

నంద్యాల: అక్కాచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత పథకం ఆర్థిక భరోసా కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడ గ్రామం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ప్రభుత్వ మైనార్టీ సలహాదారులు హబీబుల్లా, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృత్ రాజ్, బెస్త సంక్షేమ సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 4వ విడత ద్వారా జిల్లా వ్యాప్తంగా 97,254 మంది అక్కా చెలెమ్మలకు రూ.182.35 కోట్లు జమ చేశారన్నారు. ప్రభుత్వం అందిస్తోన్న ఆర్థిక సహాయాన్ని అక్కాచెల్లెమ్మలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 7 నుంచి 14 రోజుల పాటు పండగ వాతావరణంలో వైఎస్సార్ చేయూత కార్యక్రమం జరుగుతుందన్నారు. నంద్యాల జిల్లాలో 97,254 మంది లబ్ధిదారులకు రూ.183.45 కోట్లు జమ చేశామన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 15,404 మంది లబ్ధిదారులకు రూ.28.88 కోట్లు, బనగానపల్లెలో 6,435 మందికి రూ.30.82 కోట్లు, డోన్ 15,166 మందికి రూ.28.44 కోట్లు, నందికొట్కూరు 17,055 మందికి రూ.31.98 కోట్లు, నంద్యాలలో 14,308 మందికి రూ.26.83 కోట్లు, పాణ్యంలో 5,573 మందికి రూ.10.45 కోట్లు, శ్రీశైలంలో 13,313 మందికి రూ.24.96 కోట్లు వెరసి మొత్తం 97,254 మంది లబ్ధిదారులకు రూ.182.35 కోట్లు నేరుగా జమ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత కింద ఒక్కో మహిళకు ఏడాదికి రూ.18,750 ప్రతి ఏడాది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. అక్కాచెల్లెమ్మలు చిన్న, మధ్య తరహా వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా బలోపేతం చెందుతున్నారన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.


చీరల వ్యాపారం చేస్తున్నా



ప్రభుత్వం ఇప్పటి వరకు నాలుగు విడతలుగా రూ.75 వేలు నేరుగా నా ఖాతాలో జమ చేసింది. చేయూత డబ్బులతో చీరల వ్యాపారం నడుపుతున్నా. నా వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటా. మాకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా.

– పి.సావిత్రి, అయ్యలూరు, నంద్యాల మండలం

సీఎంకు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో 45 సంవత్సరాల నుంచి 60ఏళ్ల లోపు మహిళలకు ఏడాదికి రూ.18,750 వేస్తానని చెప్పి ఏటా ఇస్తున్నారు. ఇప్పటి వరకు నాకు రూ.75వేలు అందింది. ఈ డబ్బులతో నేను కుట్టుమిషన్ కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. సీఎంకు రుణపడి ఉంటాం.

– కె.మార్తమ్మ, బొల్లవరం, నందికొట్కూరు మండలం

స్వయం ఉపాధిలో రాణింపు

ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకం కింద అందజేస్తున్న డబ్బులు మహిళలు వారి కుటుంబాలు పోషించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. చాలా మంది మహిళలు వ్యాపారాలు చేసుకుంటూ స్వయం ఉపాధిలో రాణిస్తున్నారు. మహిళలు వ్యాపారాలు చేసుకోవడానికి డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు బ్యాంకర్లతో మాట్లాడి వారికి రుణాలు కూడా ఇప్పిస్తున్నాం.

– శ్రీధర్, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు గర్వకారణం

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించి అందులో సౌకర్యాలను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను కర్నూలులో ఏర్పాటు చేసుకోవడం గర్వకారణమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, శాసనసభ వ్యవహారాలు, వాణిజ్య పన్నుల నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.120కోట్లతో నిర్మించిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను, రూ.3.46కోట్లతో నిర్మించిన 10 బెడెడ్ బర్న్స్ యూనిట్‌ను, రూ.3.22కోట్లతో నిర్మించిన ఎగ్జామినేషన్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎలాంటి క్యాన్సర్‌కైనా మెరుగైన పరికరాలతో అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులతో సామాన్యుడు ఇక్కడ చికిత్స పొందే అవకాశం ఉందన్నారు. ఈ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లోని పరికరాలలో ఒక లీనియర్ ఎక్స్‌లేటర్‌ను రూ.54కోట్లతో కొనుగోలు చేశామన్నారు. ఈ పరికరం పెద్ద పెద్ద ఆసుపత్రుల్లో కూడా ఉండదన్నారు. అలాగే అడ్వాన్స్ సిటీ స్కాన్, ఎక్స్‌రే స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, బెడ్ స్కాన్ వంటి పరికరాలతో ముంబాయి లాంటి పెద్ద పెద్ద నగరాల్లో ఉపయోగించే 3 డీ థర్మాస్కోపిక్ పరికరం కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో 250 మంది వైద్యులు, సిబ్బంది పనిచేస్తున్నారు, అన్ని రకాల సూపర్‌స్పెషలిస్టులు ఉన్నారని తెలిపారు. దీని నిర్మాణానికి రూ.120 కోట్లు ఖర్చు అయితే అందులో కేవలం పరికరాల కోసం రూ.84కోట్లు, భవనాల నిర్మాణం కోసం రూ.36కోట్లు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిడిరెడ్డి, కర్నూలు శాసనసభ్యులు హఫీజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినర్సమ్మ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోండి

- డీఐజీ విజయరావు



సూచనలు చేస్తున్న డీఐజీ విజయరావు

శ్రీశైలం: శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీఐజీ సీహెచ్ విజయరావు పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన శ్రీశైలం చేరుకున్న ఆయన ట్రాఫిక్ పాయింట్స్‌లను ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. నంది సర్కిల్ టోల్ గేట్ తెలంగాణ, కర్ణాటక బస్సులు నిలుపు స్థలం, నంది మండపం, సాక్షి గణపతి, శ్రీశైలం ముఖద్వారం, సుండిపెంట, శ్రీశైల డ్యాం, తెలంగాణ వైపు ఉన్న టోల్ గేట్ ట్రాఫిక్ పాయింట్లను తనిఖీ చేశారు. దైవ దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా 24 గంటలూ సిబ్బంది విధుల్లో ఉండాలన్నారు.

క్లుప్తంగా

'మహిళా అగ్నివీర్'కు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ ఆర్మీలో 10వ తరగతి విద్యార్హతతో మహిళా అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి పీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ డ్యూటీ ఉద్యోగాలకు(4 సంవత్సరాల షార్ట్ టర్మ్ సర్వీసు) తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలోని మహిళా అభ్యర్థుల నుంచి జోనల్ రిక్రూట్‌మెంట్ కార్యాలయం చెన్నై వారు ఆన్‌లైన్ ద్వారా https://joinindianarmy.nic.in ద్వారా దరఖాస్తులకు నోటిఫికేషన్ జారీ చేశారని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, వయస్సు 17.5 నుంచి 21 సంవత్సరాలోపు ఉండాలని తెలిపారు.

ట్యాంకర్ల ఏర్పాటుకు అనుమతివ్వండి

- సీఎస్ జవహర్ రెడ్డిని కోరిన జిల్లా కలెక్టర్

కర్నూలు (సెంట్రల్): నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ఏర్పాట్లు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన కోరారు. గురువారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై సీఎస్ సమీక్షించారు. జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ వివరించారు. ఎండలు తీవ్రతరం కానున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కర్నూలు జిల్లాలో 13,406 పీఎంఏవై అర్బన్ కింద మంజూరు చేసిన ఇళ్లను గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ కార్యాలయం నుంచి ఎస్పీ జి.కృష్ణకాంత్, తన ఛాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డీఆర్వో కె.మధుసూదన్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు (లీగల్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా దినోత్సవ విశిష్టతను తెలియజేశారు. అనంతరం వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ప్రజాప్రయోజనాల సేవల సంస్థ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధికారి వెంకటలక్షుమ్మ, సీడబ్ల్యూసీ కమిటీ చైర్మన్ జుబేదా బేగం, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, సెట్కూరు సీఈఓ రమణ, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగినులు పాల్గొన్నారు.

ఇక ఆన్‌లైన్‌లో ఏపీజీఎల్ఐ సేవలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏపీజీఎల్ఐ సేవలన్నీ ఇకపై ఆన్‌లైన్‌లో నిధి పోర్టల్ ద్వారా జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవిత బీమా డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే నిధి పోర్టల్‌ను ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన వెల్లడించారు. గురువారం ఆయన కర్నూలులో విలేకరులతో మాట్లాడుతూ... నిధి పోర్టల్ ద్వారా ఏపీజీఎల్ఐ సేవలను డీడీవో స్థాయిలోనే పొందవచ్చని పేర్కొన్నారు. బీమాకు సంబంధించిన బాండ్లు కూడ నిధి పోర్టల్ నుంచి పొందవచ్చని పేర్కొన్నారు .ఏపీజీఎల్ఐ కార్యాలయం డేటాను భద్రపరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీఎల్ఐ జేడీ కృష్ణ, ఏడీ గౌరి ప్రసన్న, సూపరింటెండెంట్లు పి.రామకృష్ణారెడ్డి, మాధవీకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నీలకంధరా దేవా!


భక్తజనం మధ్య గ్రామోత్సవం


కోలాటం వేస్తున్న చిన్నారి


ఇరుముడితో శివ మాలాధారులు


ఉత్సవంలో అమ్మవారి అవతారంలో..


అలసి..సొలసిన పాదయాత్ర భక్తురాలు


భీముని కొలను మీదుగా వస్తున్న భక్తులు


రోప్‌వేలో పాతాళగంగకు చేరుకుంటూ..


పడవలో అక్కమహాదేవి గుహలకు వెళ్తున్న దృశ్యం


గజవాహన పూజలు నిర్వహిస్తున్న పండితులు


భక్తులకు పండ్లు పంపిణీ చేస్తూ..


వైద్య శిబిరంలో మాత్రల పంపిణీ

పాదయాత్ర భక్తులు నల్లమల మీదుగా తరలివస్తుండగా శ్రీగిరులు ఓంకార నాదంతో మారుమోగుతున్నాయి. శివ మాల ధారులు శ్రీశైలం చేరుతుండగా మల్లన్న మురిసిపోతున్నాడు. మహా శివరాత్రి ఘడియలు సమీపిస్తుండగా ఇల కైలాసం భక్తజనసంద్రంగా మారుతోంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను కనులారా తిలకించి తన్మయత్వం పొందుతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్


శంఖానాదం


శివనామస్మరణలో ..


భక్తులకు అన్నదానం చేస్తున్న పత్తికొండ వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళీధర్‌రెడ్డి

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

జాయింట్ కలెక్టర్ టీ.రాహుల్‌కుమార్‌రెడ్డి

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లలో ఏలాంటి లోపాలు లేకుండా అప్పగించిన విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం శ్రీశైలంలోని సీసీ కంట్రోల్ రూం సమావేశ మందిరంలో బ్రహ్మోత్సవాల జోన్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గత సమావేశంలో అప్పగించిన విధులపై ఆరా తీస్తూ చేపట్టిన ఏర్పాట్లలో లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా అన్ని సెక్టార్‌లలో పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తుందని, పారిశుద్ధ్య సిబ్బందిని మరింత పెంచి షిఫ్ట్ పద్ధతిలో 24 గంటలు పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని డీపీవోను ఆదేశించారు. భక్తులు అన్నప్రసాద వితరణ చేసే కేంద్రాల వద్ద భోజనప్లేట్లను చెత్తకుండీలలో వేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకుల వద్ద పాదయాత్ర భక్తులు స్నానాలు చేసి రోడ్ల మీద నీరు ప్రవహించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈఈని ఆదేశించారు. పాలధార-పంచధార వద్ద ఏర్పాటు చేసిన షాపులను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. సాక్షిగణపతి, నందిసర్కిల్, గోశాల తదితర ప్రదేశాలలో భక్తులు గుమిగూడకుండా ట్రాఫిక్ చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ఒక్క హోటల్‌లో ధరల పట్టిక కనడపడం లేదని అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. సాయంత్రం లోగా నిర్ణీత విక్రయ ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. పాతాళగంగ ఘాట్ వద్ద బ్యారికేడింగ్ మరింత పెంచి భద్రతా చర్యలు చేపట్టాలని మత్స్య శాఖ, ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. స్వామిఅమ్మవార్ల దర్శనార్థమై క్యూకాంప్లెక్స్‌లో, కంపార్ట్‌మెంట్లలో వేచిఉండే భక్తులకు అల్పాహారం, మంచినటి సౌకర్యం కల్పించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. సమీక్షలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ఆర్డీవో దాసు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


బ్రహ్మోత్సవ సమీక్షలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహులకరుమార్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


బనగానపల్లె: బనగానపల్లె- పండ్లాపురం గ్రామాల మధ్య సుద్ధ ఫ్యాక్టరీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మిట్టపల్లె గ్రామానికి చెందిన బ్రహ్మానందరెడ్డి బుధవారం రాత్రి పండ్లాపురం వైపు నుంచి రోడ్డు వెంట నడిచి వస్తుండగా.. బనగానపల్లె నుంచి మోటర్ సైకిల్‌పై కిరణ్‌కుమార్, జగదీశ్వరెడ్డి పండ్లాపురం వైపు వేగంగా వెళ్తూ బ్రహ్మానందరెడ్డిని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌పై వెనుక కూర్చున్న జగదీశ్వరరెడ్డి తీవ్రగాయాలకు గురయ్యారు.బ్రహ్మానందరెడ్డికి భార్య లక్ష్మీ ప్రసన్న, కుమారులు రుషికేష్ రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీశైలంలో హొళగుంద వాసి మృతి


మల్లికార్జున (ఫైల్)

హొళగుంద: శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్లిన హొళగుంద నివాసి, స్థానిక పంచాయతీ కార్యలయ కాంట్రాక్ట్ సిబ్బంది మాల మల్లికార్జున (28) గురువారం తిరుగు ప్రయాణంలో అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. శివమాల ధరించిన మల్లికార్జున రెండు రోజుల క్రితం ఇరుముడితో వాహనంలో శ్రీశైలానికి బయలుదేరారు. అక్కడ స్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం అయ్యేందుకు సిద్ధమవుతుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య శశికళ, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

ఆవాలతో ఆది దేవుడు



నంద్యాల(అర్బన్): మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ 3,250 ఆవాల గింజలతో ఆదిదేవుడు(పరమశివు)ని ఊహా చిత్రాన్ని గీచారు. డ్రాయింగ్ షీట్‌పై ఆవ గింజలను క్రమంగా అతికిస్తూ ఆదిదేవుని చిత్రాన్ని వేసి అబ్బురపరిచారు. చిత్రంలో తలపై గంగ, సిగలో నెలవంక, మెడలో నాగరాజు భక్తులకు స్వామి దీవెనలు ఇస్తున్నట్లు ఆవిష్కరించారు.

బిల్వ దళంపై త్రినేత్రుడు


బిల్వ దళంపై త్రినేత్రుడు

నంద్యాల(వ్యవసాయం): మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, ఉపాధ్యాయుడు తుర్లపాటి సుబ్రహ్మణ్యం ఆవిష్కరించిన త్రిదళంపై త్రినేత్రుడు అనే వర్ణచిత్రం ఆకట్టుకుటుంది. ఆయన మాట్లాడుతూ శివుడుకి ఒక బిల్వ దళం సమర్పిస్తే వంద అశ్వమేదయజ్ఞాలు, కోటి కన్యమహా దానాలు చేసినంత ఫలితం వస్తుందని బిల్వదళంపై చిత్రించానని చెప్పారు.

మార్కెట్ యార్డులో అగ్నిప్రమాదం

కర్నూలు (అగ్రికల్చర్) : కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైపనింగ్ చాంబర్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మార్కెట్ యార్డులో ఎండు మిర్చి, కూరగాయలు, పండ్లు నిల్వ చేసుకునేందుకు రైపనింగ్ చాంబర్ నిర్మించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రెండు ఏసీలు, జనరేటర్‌తో పాటు రైపనింగ్ చాంబర్‌కు సంబంధించిన మెటీరియల్ కాలి బూడిదైపోయింది. ప్రమాదంతో దాదాపు రూ.20 లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

రూ.3 లక్షలు అపహరణ

ఆదోనిఅర్బన్: పట్టణంలో ఆర్‌డబ్ల్యూఎస్ సీనియర్ అసిస్టెంట్ చెన్నయ్య బ్యాంకులో డబ్బులు డ్రా చేసుకుని బైకులో పెట్టి ఆఫీసుకు వెళ్లడంతో గురువారం చోరీ జరిగింది. బాధితుడు చెన్నయ్య టూటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. ఎస్‌బీఐ బ్యాంకులో రూ.3 లక్షలు డ్రా చేసుకుని కవర్‌లో చుట్టి తన బైకు సైడ్ బ్యాగులో పెట్టి ఎదురుగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోకి వెళ్లారు. కార్యాలయంలో నీరు తాగి తిరిగి వచ్చి చూడగా బ్యాగులో డబ్బు మాయమయ్యాయి. దీంతో అవాక్కైన చెన్నయ్య వెంటనే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కార్పొరేషన్ బ్యాంకులో లోన్ చెల్లించేందుకు నగదు డ్రా చేసినట్లు బాధితుడు వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ గోపి తెలిపారు.

రావణ వాహనాధీశా నమోస్తుతే


రావణవాహనంపై కొలువైన మహానందీశ్వరుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఈఓ, పండితులు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారు ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి రావణ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, రుత్వికులు ఉదయం నుంచి రాత్రి వరకు విశేషపూజలు చేశారు. మహానందీశ్వరస్వామికి గర్భాలయంలో విశేష రుద్రాభిషేకం, అమ్మవారికి అర్చనలు నిర్వహించారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అలంకారం చేసి సూర్యప్రభ వాహనంపై కొలువు చేశారు. రాత్రి మహానందీశ్వర దంపతులు రావణవాహనంపై కొలువై అలయ ప్రాంగణంలో విహరించారు. వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఓం నమో మహానందీశ్వరా...అంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రణమిల్లారు. పూజా కార్యక్రమాల్లో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ పి.గురుప్రసాద్, ఏఈఓలు వై.మధు, ఓంకారం వెంకటేశ్వరుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందీశ్వర స్వామి వారి కళ్యాణోత్సవానికి హైదరాబాద్ నగరానికి చెందిన దేశగాని శ్రీనివాస గౌడ్ దంపతులు కిలో ముత్యాలను బహూకరించారు. ఈ మేరకు గురువారం వారు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో ముత్యాలను అందించారు. లింగోద్భవం అభిషేకం అనంతరం శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి జరిగే కళ్యాణోత్సవంలో తలంబ్రాలుగా వీటిని వినియోగిస్తారు. కార్యక్రమంలో ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, ఆలయ పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు


మాట్లాడుతున్న డైరెక్టర్ సుబ్బరాజు

నంద్యాల(అర్బన్): రైతులు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు అన్నారు. విద్యుత్ కనెక్షన్లు, పెండింగ్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. స్థానిక డీఈ కార్యాలయంలో నంద్యాల డివిజన్ డీఈలు, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ నంద్యాల డివిజన్‌లో 1,132 అగ్రికల్చర్ కనెక్షన్లు ఉన్నాయని, కనెక్షన్లలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. వేసవిలో 100 శాతం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అంతరాయాలతో ఏ ఒక్కరు ఇబ్బందు పడకుండా ఉండాలన్నారు. పంచాయతీలకు నిధులు విడుదలయ్యాయని, పెండింగ్ బకాయిలు ఉన్న పంచాయతీలకు నోటీసులు పంపి వసూళ్ల కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. డివిజన్‌లో రుద్రవరం మండలం, ఆర్.నాగులవరం, బండిఆత్మకూరు మండలం వీఆర్‌పేట కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారంభించనున్నామన్నారు. విద్యుత్ సరఫరాపై అధికారులు నిరంతరం దృష్టి సారించి నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు:కర్నూలు నగరంతో పాటు, కల్లూరు అర్బన్ కాలనీలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి కల్లూరు అర్బన్ 35వ వార్డు చెన్నమ్మ సర్కిల్ నుంచి సుంకులా పరమేశ్వరి ఆలయం వరకు రూ.1.20 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, సెంట్రల్ మీడియన్, సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరంతో పాటు కల్లూరు అర్బన్ కాలనీలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు చెప్పే అబద్ధపు మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించి మంచి చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.